జాన్‌పహాడ్ దర్గా వద్ద చేసిన ఏర్పాట్లు

నేటి నుంచి జాన్‌పహాడ్ ఉర్సు

- మూడు రోజులపాటు జాతర
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

పాలకవీడు, జనవరి 24 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే జాన్‌పహాడ్ దర్గా ఉర్సు నేటి నుంచి ప్రారంభం కానున్నది. ఈ నెల 25, 26, 27 తేదీల్లో జరిగే సైదులు బాబా ఉత్సవాలకు దర్గా నిర్వాహకులు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏడాదికి ఒకసారి జనవరి చివరి మాసంలో జరిగే ఉర్సుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఈ ఉత్సవాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.13 లక్షలు కేటాయించింది. ఉర్సును పురస్కరించుకొని దర్గాకు రంగులు వేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ పరిసరాలు దుకాణాల సముదాయాలతో కళకళలాడుతున్నాయి.

గుసూల్ షరీఫ్‌తో ప్రారంభం

ఉర్సులో తొలిరోజు గురువారం గుసూల్ షరీఫ్ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా సైదులు బాబా సమాధులు, దర్గా పరిసరాల్లో ఉన్న సిపాయిల సమాధుల మీద ఉన్న పాత చాదర్‌లను తొలగించి శుభ్రం చేస్తారు. అనంతరం సమాధులపై పూలు, దట్టీలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా గంధం మహోత్సవం

ఉర్సులో ప్రధాన ఘట్టం గంధం మహోత్సవం. 26న శుక్రవారం ఘనంగా నిర్వహిస్తారు. గంధం కలశానికి పూజలు చేసి చందల్‌ఖానకు ఊరేగింపుగా వెళ్తారు. అక్కడ హైదరాబాద్ వక్ఫ్‌బోర్డు వారు తెచ్చిన గంధాన్ని తీసుకొని జాన్‌పహాడ్ గ్రామంలో ఊరేగింపుగా తిరుగుతూ దర్గా వద్దకు చేరుకొంటారు. పవిత్ర గంధాన్ని బాబా సమాధుల పెట్టి ప్రార్థనలు నిర్వహిస్తారు. గంధాన్ని తాకితే సంవత్సరం అంతా మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. 27న ఉదయం ప్రత్యేక దర్శనాల అనంతరం శనివారం సాయంత్రం దీపారాధనతో ఉర్సును ముగిస్తారు.

ప్రతి అరగంటకు ఆర్టీసీ బస్సు

ఉర్సుకు వచ్చే భక్తులకు ప్రయాణ ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది, సూర్యాపేట, కోదాడ, మిర్యాలగూడ డిపోల నుంచి ప్రతి అరగంటకు ఒక బస్సు నడిచేలా ఏర్పాటు చేసింది. మిర్యాలగూడ డిపోకు చెందిన బస్సులను దామరచర్ల మీదుగా జాన్‌పహాడ్ దర్గాకు .. సూర్యాపేట, కోదాడ డిపోలకు చెందిన బస్సులను నేరేడుచర్ల మీదుగా నడుపుతున్నట్లు ఆయా డిపో మేనేజర్లు తెలిపారు.

అన్ని సౌకర్యాలు

దర్గా వద్దకు వచ్చే భక్తుల కోసం వివిధ శాఖలు అందుబాటులో ఉండనున్నాయి. వైద్యారోగ్య, పోలీస్, ఆర్టీసీ, అగ్నిమాపక, 108 సిబ్బంది ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశాయి. హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటాచారి ఏర్పాట్లపై అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నారు. తాగునీరు, పారిశుధ్య సమస్య రాకుండా రెవెన్యూ, పంచాయతీ అధికారులు అన్నీ సిద్ధం చేశారు. ఇక ఉత్సవాలకు 500 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నట్లు కోదాడ డీఎస్పీ ప్రకాశ్, హుజుర్‌నగర్ సీఐ రామలింగారెడ్డి తెలిపారు. దర్గా పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దర్గా ఎదుట, లోపల ప్రత్యేక క్యూలైన్లు పెట్టించారు. శూన్యపహాడ్ రహదారి వెంబడి, జాన్‌పహాడ్ రోడ్ పెట్రోల్ బంక్ వద్ద పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు.

అందరి దృష్టి లోక్‌సభ ఎన్నికల పైనే..

వ్యూహాత్మకంగా బీఆర్ఎస్ అడుగులు

- ఇప్పటికే సమీక్షా సమావేశాలు పూర్తి
- నేడు హైదరాబాద్‌లో కాంగ్రెస్ బూత్ కమిటీలతో మీటింగ్
- కేంద్ర మంత్రులు, నేతలతో బీజేపీ హడావుడి
- వచ్చే నెలలోనే షెడ్యూల్ ప్రచారంతో కసరత్తు వేగవంతం



నల్లగొండ ప్రతినిధి, జనవరి24(నమస్తే తెలంగాణ) : గతంలో పోలిస్తే లోక్‌సభ ఎన్నికలు అడ్వాన్స్‌గా రావచ్చని వార్తలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 8న కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితాను ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో తుది జాబితా వెలువడిన అనంతరం ఎప్పుడైనా ఎన్నికల షెడ్యూల్ రావచ్చని సమాచారం. దాంతో అన్ని రాజకీయ పార్టీలు తమ కార్యాచరణను వేగవంతం చేశాయి. ఇందులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే భువనగిరి, నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ప్రత్యేకంగా సమీక్ష సమావేశాలు కూడా పూర్తి చేసింది. నియోజకవర్గ పరిధిలోని కీలకమైన ప్రజాప్రతినిధులు, నేతలంతా ఇందులో భాగస్వాములయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పార్టీ శ్రేణులంతా ఎన్నికలకు సమాయత్తం అయ్యేలా దిశానిర్దేశం చేశారు. ఇక త్వరలోనే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కూడా సమావేశాల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఇదే విధంగా క్షేత్రస్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో ఎన్నికలకు రెడీ చేసేలా చర్యలు చేపడుతున్నారు. మరోవైపు ఎంపీ అభ్యర్థుల ఎంపిక పైనా పార్టీ అధినేత కేసీఆర్ ఇప్పటికే కసరత్తు చేస్తున్నట్లు చర్చ సాగుతున్నది. అందరికీ ఆమోదయోగ్యంగా బలమైన అభ్యర్థులను త్వరలోనే ఖరారు చేస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాల ఊపుతో కాంగ్రెస్ పార్టీ కూడా లోక్‌సభ ఎన్నికలపై దృష్టి సారించింది. ఇప్పటికే భువనగిరికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, నల్లగొండకు మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఇన్‌చార్జీలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. వీరి సారథ్యంలోనే పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో బూత్ లెవల్ కార్యకర్తల సమ్మేళనానికి ఏర్పాట్లు చేసింది. దీనికి బూత్ కమిటీల నుంచి మొదలుకుని అన్ని స్థాయిల్లోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలను ఆహ్వానించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం దశలవారీగా ఎన్నికల వ్యూహ రచనతో ముందుకు సాగనున్నట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి లేదా కోమటిరెడ్డి కుటుంబంలో నుంచి ఒకరు అభ్యర్థిగా ఉండనున్నట్లు సమాచారం. నల్లగొండ నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డి లేదా పటేల్ రమేశ్‌రెడ్డిలో ఒకరు అభ్యర్థిగా బరిలో ఉంటారన్న చర్చ సాగుతున్నది. బీజేపీ సైతం లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా తమ కార్యక్రమాలను ముమ్మరం చేసింది.

ఇప్పటికే రెండు నియోజకవర్గాల పరిధిలో కేంద్ర మంత్రుల పర్యటనలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర పార్టీ నేతలు కూడా పార్టీ శ్రేణులతో భేటీ అవుతున్నారు. ఇటీవలే మూడు జిల్లాలకు కొత్త అధ్యక్షులను ప్రకటించారు. ఇక అయోధ్య రామ మందిరంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఆధారంగా విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫిబ్రవరి రెండో వారంలో జిల్లా పరిధిలో ప్రధాని మోదీతో బహిరంగసభకు కూడా సన్నాహకాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. వీటన్నింటి ఆధారంగా ఉమ్మడి జిల్లా పరిధిలో గెలిచే అవకాశాలు లేకపోయినా బీజేపీ ఓటింగ్ శాతం పెంచుకుని ఉనికి చాటాలన్న లక్ష్యంతో కనిపిస్తున్నది. ఇక జిల్లాలో ఒకప్పుడు గెలుపోటముల్లో కీలకమైన సీపీఎం, సీపీఐ ఈ సారి పోటీ చేసే అవకాశాలు కనిపించడం లేదు. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించనున్నట్లు సమాచారం.

విద్యార్థులు సామాజిక దృక్పథం అలవర్చుకోవాలి

ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రమణి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రమణి

భువనగిరి కలెక్టరేట్, జనవరి 24 : విద్యార్థులు సామాజిక దృక్పథం అలవర్చుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రమణి అన్నారు. భువనగిరికి చెందిన ఎలిమినేటి లక్ష్మమ్మ-నర్సారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని బస్వాపూర్ గ్రామంలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శీతాకాల శిబిరం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శీతాకాల శిబిరాలతో మానసిక, శారీరక పరిపక్వతతోపాటు గ్రామస్తులతో మమేకంతో సామాజిక దృక్పథం అలవడుతుందన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి చంద్రకళ మాట్లాడుతూ.. బస్వాపూర్‌లో పరిసరాల పరిశుభ్రత, గ్రామస్తుల ఆరోగ్య సర్వే, ఉపాధి లేని యువత సర్వే, మొక్కల నాటింపు, హనుమాన్ ఆలయాన్ని శుభ్రం చేయడం తదితర కార్యక్రమాల్లో వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంజుల, కళాశాల అధ్యాపకులు అరుణ, సంగీత, ఎలియాజర్, మల్లీశ్వరి, శివచందు, రాజు, కళాశాల సిబ్బంది శ్రీనివాస్, కళావతి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



మోత్కూరులో రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

రహదారుల మెరుగుకు కృషి

- ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జనవరి 24 : ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా రహదారుల మెరుగుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ తెలిపారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని టెలిఫోన్ ఎక్స్‌చేంజ్ కార్యాలయం నుంచి రాజన్నగూడెం వరకు ప్రభుత్వం రూ.5.80 కోట్లతో మంజూరు చేసిన బీటీ రోడ్డు మరమ్మతులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. అనంతరం పట్టణంలోని వడ్డెర కాలనీలో కాంగ్రెస్ కార్యకర్త యాదగిరి ఇటీవల మృతిచెందగా మృతిచెందిన ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రీమేఘారెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ షబానా, సిబ్బంది పాల్గొన్నారు.

లింగయ్యకు నివాళి

అడ్డగూడూరు: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు కన్నెబోయిన లింగయ్య (65) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మృతదేహాన్ని ఎమ్మెల్యే మందుల సామేల్ సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీపీసీసీ రాష్ట్ర నాయకులు ఇటికాల చిరంజివి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పోలెబోయిన లింగయ్యయాదవ్, నాయకులు వల్లంభట్ల పూర్ణచందర్‌రావు, చిప్పలపల్లి బాలు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, జనవరి 24 : పనిలో నైపుణ్యంతో టీమ్‌గా పని చేసి పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సిబ్బందికి సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలీసు అధికారుల నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో జరిగిన కేసుల నమోదు, దర్యాప్తు, పెండింగ్ కేసులు, కోర్టు విధులు, కేసుల్లో శిక్ష అమలు, క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్, సీసీటీఎన్ఎస్ ఆన్‌లైన్ అప్‌లోడ్, పెట్టి కేసులు, ఈ చలాన్, రౌడీషీట్స్, సస్పెక్ట్ షీట్స్ అప్‌డేట్ వంటి అంశాలపై చర్చించి సూచనలు చేశారు. మహిళా సంబంధిత కేసుల్లో ముఖ్యంగా మిస్సింగ్ కేసుల్లో అలసత్వం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, ప్రకాశ్, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్, మహేశ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, సీఐలు శివశంకర్, రాజశేఖర్, మురారి, రాము, వీరరాఘవులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద రహిత డ్రైవర్‌కు సన్మానం

డ్రైవర్ మల్లికార్జున్‌ను శాలువతో సన్మానిస్తున్న మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు

యాదగిరిగుట్ట, జనవరి 24 : డ్రైవర్స్ డే సందర్భంగా యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో 29 ఏళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తూ ప్రమాదరహిత డ్రైవర్‌గా సేవలందించిన పి.మల్లికార్జున్‌ను బుధవారం మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు సన్మానించారు. అదేవిధంగా డిపోలో ప్రమాద రహిత డ్రైవర్లుగా సేవలందిస్తున్న బాల నరసింహ, రమేశ్, మల్లయ్యను అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మాధవి, డిపో మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ హుస్సేన్, అసిస్టెంట్ ఇంజినీర్ హనుమానాయక్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 9న మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

మోత్కూరు, జనవరి 24 : మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రీమేఘారెడ్డిపై అవిశ్వాస తీర్మాన సమావేశం ఫిబ్రవరి 9న జరుగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ హన్మంతు కే జెండగే ఆదేశాల మేరకు మున్సిపల్ కౌన్సిలర్లకు అవిశ్వాస తీర్మానం నోటీసులు అందజేసినట్లు చెప్పారు. మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లకు గానూ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్యతో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు చైరపర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెడుతూ సంతకాలను చేసి ఈ నెల 20న కలెక్టర్‌కు అందజేశారు. అప్పటి నుంచి కౌన్సిలర్లు రహస్య ప్రదేశంలో క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 9న అవిశ్వాస సమావేశం భువనగిరి ఆర్డీఓ సమక్షంలో జరుగనున్నట్లు సమాచారం.

విద్యతోనే బాలికల భవిష్యత్‌కు బాటలు

- ఎంపీపీ పార్వతి

మఠంపల్లి బాలికల గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతీకొండానాయక్

మఠంపల్లి, జనవరి 24 : విద్యతోనే బాలికల ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు పడుతాయని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవ వేడుకలకు ఎంఈఓ చత్రూనాయక్, ఎంపీడీఓ జానకిరాములుతో కలిసి హాజరై మాట్లాడారు. బాలికలను సురక్షితమైన వాతావరణంలో స్వేచ్ఛగా, హాయిగా ఎదిగే అవకాశాలు కల్పించాలన్నారు. హింస, వివక్ష, వేధింపులు లేని సమాజం కోరుకుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజుల, డాక్టర్లు సుధాకర్, నాగేందర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు : మండలంలోని గాంధీనగర్‌తండాలో గల కస్తూర్బా పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు డ్రాయింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆత్మకూర్.ఎస్ : లింగ వివక్షత చూపరాదని ఎంఈఓ ధారాసింగ్ అన్నారు. మండల పరిధిలోని జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికలంతా మంచి చదువులు చదివి సమాజంలో ముందుండాలన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

మోత్కూరు, జనవరి 24 : దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు తన కుమారుడు సురోజు రవికుమార్ జ్ఞాపకార్థం తల్లిదండ్రులు యాదమ్మ-భాస్కరాచారి సహకారంతో స్టడీ మెటిరీయల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఎన్ చారి, మాజీ సర్పంచ్ చేతరాశి అంజయ్య, హెచ్ఎం టి.రవి, సీపీఎం నాయకుడు బొల్లు యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిఖిల ఇంటి ఎదుట రహదారిపై బైఠాయించిన దళిత మహిళలు

దళిత చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం వెనక్కి తీసుకోవాలి

- కౌన్సిలర్ నిఖిల ఇంటి ముందు దళిత మహిళల బైఠాయింపు

బొడ్రాయిబజార్, జనవరి 24 : సూర్యాపేట మున్సిపాలిటీ చరిత్రలో ఓ దళిత మహిళా చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడం అగ్రవర్ణాలకు దళితుల పట్ల, మహిళల పట్ల ఉన్న వివక్షతను తెలియజేస్తున్నదని మాల మహానాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు పిట్టల భాగ్యమ్మ అన్నారు. దళిత, మహిళా చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణపై పెట్టిన అవిశ్వాసాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత మహిళలు చైర్మన్ రేసులో ఉన్న 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలాదిలీప్‌రెడ్డి ఇంటి ముందు పెద్ద ఎత్తున బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదేశాల మేరకు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన అన్నపూర్ణ నాలుగేండ్ల కాలంలో ఎలాంటి అవినీతి లేకుండా అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందించినట్లు చెప్పారు. అవిశ్వాసాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో అవిశ్వాసానికి మద్దతు పలికే ప్రతి కౌన్సిలర్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆందోళనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో దళిత మహిళా సంఘాల నాయకులు రజిని, జయమ్మ, భానుశ్రీ, విజయ, నీలమ్మ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

హుజూర్‌నగర్, జనవరి 24 : హుజూర్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావుపై అవిశ్వాసం నెగ్గింది. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తాసీల్దార్ నాగార్జునరెడ్డి సమక్షంలో అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో 28 మంది కౌన్సిలర్లు ఉండగా నలుగురు కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశానికి గైర్హాజరయ్యారు. అవిశ్వాసానికి 24 మంది సభ్యులు హాజరయ్యారు. 19 మంది కౌన్సిలర్ల ఫోరం కావాల్సి ఉండగా 22 మంది చేతులెత్తి మద్దతు తెలుపడంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీఓ ప్రకటించారు. బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు అట్లూరి మంజుల, జక్కుల వీరయ్య అవిశ్వాసానికి వ్యతిరేకంగా చేతులెత్తారు. కాగా నూతన వైస్ చైర్మన్‌గా కోతి సంపత్‌రెడ్డి పేరును కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.

కార్మిక, కర్షక ర్యాలీని జయప్రదం చేయాలి

- రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ

నడిగూడెం, జనవరి 24 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న కిసాన్ సంయుక్త మెర్చా ఆధ్వర్యంలో కోదాడలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని రామాపురం, చాకిరాల, ఈకేపేట, తెల్లబెల్లి, రత్నవరం గ్రామాల్లో ర్యాలీని విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ర్యాలీకి రైతులు, కార్మికులు, కూలీలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో గీత కార్మికుల రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఏనుగుల వీరాంజనేయులు, కన్నెబోయిన సైదులు, సత్యం, వీరబోయిన సైదులు, ఈద శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారావు, సూర్యనారాయణరెడ్డి, శ్రీను, వీరస్వామి, కోటయ్య, అశోక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్పూరి ఠాగూరు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న హర్షణీయం

- నాయీ బ్రాహ్మణ సంఘం

తిరుమలగిరి, జనవరి 24 : బిహార్ జన నాయక్‌గా ప్రసిద్ధి పొందిన మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత కర్పూరీ ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని నాయీ బ్రాహ్మణ సంఘం పేర్కొంది. ఠాకూర్ జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చిప్పలపల్లి శ్రీనివాస్, కొత్తగట్టు మల్లయ్య, నిమ్మకంటి సైదులు, కొత్తగట్టు యాదగిరి, సోమయ్య, రాజు, రాంమూర్తి, లింగయ్య పాల్గొన్నారు.

పారామెడికల్ శిక్షణ తరగతులు నిర్వహించాలి

- ఆర్ఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్

సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

నేరేడుచర్ల, జనవరి 24 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆర్ఎంపీ, పీఎంపీలకు పారా మెడికల్ శిక్షణ తరగుతులు నిర్వహించాలని రూరల్ మెడికల్ ప్రాక్టిషనర్స్(ఆర్ఎంపీ) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన నేరేడుచర్ల, పాలకవీడు మండలాల గ్రామీణ వైద్యుల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ తరగతులను నిర్వహించి సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు పొనుగోటి భుజంగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుణగంటి వెంకన్న, క్రమ శిక్షణ సంఘం అధ్యక్షుడు వెంటప్పయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు మన్సూర్ అలీ, నేరేడుచర్ల, పాలకవీడు మండలాధ్యక్షులు ఉపేందర్, పిచ్చయ్య పాల్గొన్నారు.